క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

కేశంపేట: అమ్మ హస్తం పథకంలో భాగంగా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంగళవారం మండల కేంద్రానికి వస్తున్నట్టు ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా ప్రజలకు సన్నబియ్యం పంపిణీ చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కార్యకర్తకు పరామర్శ



బీరయ్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్: ఇటీవల చెట్టుపై నుంచి పడి చికిత్స పొందుతున్న బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తను మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సోమవారం పరామర్శించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని భీమారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త కుర్వ బీరయ్య ఇటీవల చెట్టుపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పట్టణంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను పరామర్శించి, ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నాడు. ఆయన వెంట నాయకులు వంకాయల నారాయణరెడ్డి, కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్‌నాయక్, నట్‌రాజ్, వీరేశంగుప్తా, పిల్లి శేఖర్ తదితరులు ఉన్నారు.

వక్ఫ్ బిల్లు సవరణపై నిరసన

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని విఠ్యాలలో ఈద్గా వద్ద ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. రంజాన్ పండగ సందర్భంగా గ్రామంలో ఉన్న ఈద్గా వద్ద ప్రార్థనల అనంతరం ముస్లింలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో మతసామరస్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తోందని, వక్ఫ్ బిల్లును సవరించడం సరికాదన్నారు. వక్ఫ్ బిల్లు దేశ లౌకికవాదానికి సంబంధించిన అంశం అన్నారు. మతాలకతీతంగా అందరూ ఈ బిల్లును వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు



మహేందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

చేవెళ్ల: బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్‌ను బీజేపీ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఆయన నివాసంలో కలిసి జన్మదిన శుభాకంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. బీజేవైఎంను బలోపేతం చేసేందుకు తాము కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో చేవెళ్ల మండల పార్టీ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా నాయకుడు ఇంద్రసేనారెడ్డి, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, మచ్చేందర్, అశోక్, అభి, శ్రీనివాస్, జయసింహరాజు, ప్రవీణ్, శేఖర్ తదితరులు ఉన్నారు.

'మహనీయుల జాతర'ను జయప్రదం చేయండి

బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగన్న

ఆమనగల్లు: బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 26న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న మహాసభను జయప్రదం చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో 'మహనీయుల జాతర' మహాసభ వాల్‌పోస్టర్‌ను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా రిజర్వేషన్ నియోజకవర్గాల్లో తప్పా జనరల్ కాన్‌స్టెన్సీలో బహుజనులకు ప్రాతినిధ్యం లేదని పేర్కొన్నారు. యూపీలో ఓట్లు మావి, సీట్లు మీవా అనే నినాదంతో బహుజనులు పాలకులయ్యారని, అదేవిధంగా తెలంగాణలో బీఎస్పీ ఉద్యమిస్తుందన్నారు. జాతరకు పార్టీ ఎంపీ, జాతీయ కోఆర్డినేటర్ రాంజీగౌతమ్ ముఖ్య అతిథిగా రానున్నారని, ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ, అగ్రకులాల వారు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ స్టేట్ ఈసీ మెంబర్ ధనంజయ్, జిల్లా ఇన్‌చార్జి పృథ్వీరాజ్, జిల్లా అధ్యక్షుడు రాంచందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీహర్ష ముదిరాజ్, అంబేద్కర్ జాతర ఫౌండర్ సుధాకర్, నాయకులు ఆంజనేయులు, రమేష్, ధన్నారం మహేష్ తదితరులు ఉన్నారు.



చేవెళ్ల: ఆలూరులో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



శంకర్‌పల్లిలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే యాదయ్య



షాద్‌నగర్: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

భక్తిశ్రద్ధలతో రంజాన్

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో రంజాన్(ఈద్–ఉల్–ఫితర్) వేడుకలను సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం నుంచే ఆయా గ్రామాల్లోని ఈద్గాలు, మసీదుల వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరూ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మతపెద్దలు దేవుడి సందేశాన్ని వినిపించారు. అనంతరం కులమతాలకు అతీతంగా హిందూ ముస్లింలు అలయ్ బలయ్ చేసుకుంటూ ఈద్ ముబారక్ తెలుపుకొన్నారు.



షాద్‌నగర్‌లో ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



చేవెళ్లలో పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు



షాబాద్: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి



షాబాద్: పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా గ్రంథాయల సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



చేవెళ్ల: పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



షాద్‌నగర్: ముస్లింలతో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



మొయినాబాద్‌రూరల్: ముస్లింలతో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి



కొత్తూరు: రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



కొందుర్గు: చౌదరిగూడలో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు



కేశంపేట: నిర్దవెల్లిలో పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: వేసవిలో నీటి ఎద్దడి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మున్సిపల్ అధికారులకు సూచించారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కొత్తూరు మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో పెట్టుకొని అధికారులు పట్టణంలో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ల లీకేజీలు లేకుండా మరమ్మతులు చేపట్టాలన్నారు. నీటి వృథాను అరికట్టేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రతి కాలనీలో పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడూ నిర్వహించాలని, డ్రైనేజీలను శుభ్రం చేయాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని సూచించారు. కొన్ని కాలనీల్లో విద్యుత్ లైట్లు లేకపోవడంతో చీకటిగా ఉంటుందని, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పనిచేయని విద్యుత్ దీపాలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని కోరారు. అదేవిధంగా మున్సిపల్ ఆదాయం పెంచే విధంగా అధికారులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి

షాబాద్: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కేసారం గ్రామంలో రూ.5లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షాబాద్ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కార్యకర్తలు ఐక్యంగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా కాంగ్రెస్ ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కాలనీల్లో సీసీరోడ్ల నిర్మాణాల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఇది ప్రజాపాలన ప్రభుత్వమని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చడంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెన్నయ్య, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీరాంరెడ్డి, నర్సింలుగౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పామెన నర్సింలు, మంగలి చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి సంతోష్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న సురేందర్‌రెడ్డి, నాయకులు

నేడు సన్నబియ్యం పంపిణీ

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాల్లో మంగళవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తారని ఆయా మండలాల అధ్యక్షులు కృష్ణారెడ్డి, కావలి రాజు సోమవారం వేర్వేరు ప్రకటనలలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు కొందుర్గు 2, 3 చౌకధర దుకాణాల్లో బియ్యం పంపిణీ ప్రారంభిస్తారని కృష్ణారెడ్డి తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం 1 గంటలకు చౌదరిగూడ 1వ దుకాణంలో బియ్యం పంపిణీ ప్రారంభిస్తారని రాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రేషన్‌కార్డుదారులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



యాదగిరిని సన్మానిస్తున్న విశ్వకర్మ సంఘం సభ్యులు

మొయినాబాద్‌రూరల్: రాజేంద్రనగర్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కాసోజు యాదగిరిని విశ్వకర్మ సంఘం సభ్యుడు శ్రీనివాసచారి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌కు చెందిన కాసోజు యాదగిరి రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా గెలుపొందాడు. ఈ సందర్భంగా విశ్వకర్మ సంఘం మండల సభ్యుడు శ్రీనివాసచారి ఆధ్వర్యంలో కాసోజు యాదగిరిని సోమవారం ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన యాదగిరి మాట్లాడుతూ.. న్యాయవ్యవస్థలో ప్రజలకు అన్యాయం జరగకుండా చూడడానికి కృషిచేస్తానని తెలిపారు. రాజేంద్రనగర్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో తాను అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా తనను గౌరవించి సన్మానించినందుకు విశ్వకర్మ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తమ వంతు సహాయంగా విశ్వకర్మ సంఘంలో పనిచేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బాకారం శ్రీనివాసచారి, జి.ప్రవీణ్, రాంరెడ్డి, ప్రేమ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

వినిపించని ప్రజావాణి

- మండల స్థాయిలో నిలిచిన కార్యక్రమం
- నిరాశలో దరఖాస్తుదారులు



ప్రజావాణి నిర్వహించే తహసీల్దార్ కార్యాలయం

కొత్తూరు: గ్రామాల్లో ప్రజలకు ఎదురయ్యే పలు రకాల సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించే విధంగా ప్రభుత్వం గతంలో ప్రతీ సోమవారం తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించింది. మొదట్లో ప్రజావాణికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. కార్యక్రమాన్ని కలెక్టర్ స్థాయి అధికారి పర్యవేక్షిస్తుండడంతో అధికారులు తమకు వచ్చిన ఫిర్యాదులు, దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేవారు. వచ్చిన దరఖాస్తుల్లో తమ పరిధిలో పరిష్కరించే అవకాశం ఉన్న వాటిని మినహాయించి జిల్లా స్థాయి దరఖాస్తులను ఉన్నతాధికారులకు చేరవేసేవారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ప్రజావాణి కార్యక్రమం ప్రస్తుతం మండలస్థాయిలో కొనసాగడం లేదు. దీంతో ప్రతీ చిన్న దరఖాస్తు, ఫిర్యాదుల కోసం ప్రజలు ఉన్నతాధికారుల వద్దకు వెళ్లాల్సి వస్తోంది.

ప్రజల సౌకర్యార్థమే..

గ్రామాల్లో చాలాకాలంగా తిష్టవేసిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు మండలస్థాయి అధికారులకు దరఖాస్తు చేసేవారు. కాగా గతంలో జిల్లాస్థాయిలో కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఉండేది. అక్కడ సమస్యలపై ఫిర్యాదు చేస్తే తప్పకుండా వాటికి పరిష్కారం ఉండేది. దీంతో గ్రామస్థాయి నుంచి ప్రజలు జిల్లా కేంద్రానికి వచ్చి ఇబ్బందులు పడకుండా వారు సూచించే సమస్యలను మండలస్థాయిలోనే పరిష్కరించడానికి ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించేవారు. దీంతో ప్రజల రవాణా ఖర్చులను మిగిల్చడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుందనే ఉద్దేశంతో మండలస్థాయిలో సమావేశాన్ని నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు.



ప్రజావాణిలో ఓ సమస్యపై ఫిర్యాదు చేస్తున్న ప్రజలు(ఫైల్)

జిల్లాకు దరఖాస్తుదారులు..

గతంలో మండలస్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీఓ, వ్యవసాయశాఖ అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖ, ఎక్సైజ్, విద్యుత్‌తో పాటు పలు శాఖలకు చెందిన అధికారులు విధిగా పాల్గొనాలనే ఆదేశాలు ఉండేవి. కార్యక్రమంలో భాగంగా వారు ప్రజల నుంచి ఆయా సమస్యలపై వచ్చే దరఖాస్తులను స్వీకరించి వారికి రసీదులు ఇచ్చి గడువులోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకునేవారు. ప్రస్తుతం మండలస్థాయిలో ప్రజావాణి కార్యక్రమం కొనసాగకపోవడంతో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని ఆశ్రయిస్తున్నారు.

ఫిర్యాదులను పరిష్కరిస్తున్నాం



ప్రస్తుతం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం కొనసాగడం లేదు. తమ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదులు, దరఖాస్తులను పరిశీలించి మా స్థాయిలో ఉంటే పరిష్కరిస్తున్నాం. ఇటీవలే ఆర్డీఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచి మండలానికి సంబంధించిన దరఖాస్తులు వస్తున్నాయి.

– రవీందర్‌రెడ్డి, తహసీల్దార్, కొత్తూరు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
జి. మల్లికార్జున్
9505507564